సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



అడవి మానులే దేవుళ్లు

బుట్టాయగూడెం మండలంలోని లక్ష్మీపురంలో నాలుగు రకాల చెట్ల మానులను దేవుళ్లగా కొలుస్తూ శ్రీరామనవమిని జరుపుకుంటారు. 8లో ▸



నిర్వాసితులకు నిరాశేనా?

పోలవరం ప్రాజెక్టుతో నిర్వాసితులవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను ఆదుకునే పరిస్థితులు కనిపించడం లేదు. 8లో ▸



డ్రోన్‌తో జూదరుల గుర్తింపు

ఉండి శివారు పంట పొలాల వద్ద పేకాట ఆడుతున్న 9 మందిని డ్రోన్ ద్వారా గుర్తించి పోలీసులు కేసులు నమోదు చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

భావితరాలకు మార్గదర్శి జగ్జీవన్



కలెక్టరేట్‌లో జగ్జీవన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, జిల్లా ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయులు బాబూ జగ్జీవన్ రామ్ అని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్ చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్ భావితరాలకు మార్గదర్శి అని అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని విధంగా దాదాపు 30 ఏళ్లపాటు కేంద్ర మంత్రి, ఉప ప్రధానిగా ఆయన సేవలందించారన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీ విద్యకు ఆయన అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. డీవీఎంసీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ, తెన్నేటి జగ్జీవన్, బంగారు కరుణ రాజు, తాడికొండ జయకృష్ణ, విజయ రాజు, కె.క్రాంతి బాబు మాట్లాడారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిక అధికారి బీవీఎస్‌బీ రామాంజనేయరాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

భీమవరం అర్బన్: జిల్లాలో 6 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తుందుర్రులో రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని వారికి నచ్చిన మిల్లులకే విక్రయించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు.

2 లక్షల టన్నులు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో దాళ్వా ధాన్యం సేకరణ లక్ష్యం 2 లక్షల టన్నుల అని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో 118 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు తగవు

భీమవరం: జిల్లాలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు తగదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. సాధారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా అధికారులు నియమిస్తారని, అయితే కూటమి నాయకులు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ స్థానంలో కూటమి పార్టీల కార్యకర్తలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించేందుకు పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురిచేయడం సరికాదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే హక్కు అధికారులకు తప్ప రాజకీయ నాయకులకు లేదని తెలిపారు. ఎప్పటినుంచో పనిచేస్తున్న మేట్లను కూడా తొలగించి ఇటీవల జాబ్ కార్డు వచ్చిన వారిని నియమించాలని మొగల్తూరు మండలంలో ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వేధింపులు మానకుంటే జిల్లావ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.

కారుమబ్బుల కలవరం



అలంపురంలో కమ్ముకున్న మబ్బులు

పెంటపాడు: కారుమబ్బులు వరి రైతులను కలవరపెడుతున్నాయి. పంట చేతికొచ్చే దశలో అకాల వర్షాలు కురిస్తే నిండా మునిగిపోతామని ఆందోళన చెందుతున్నారు. శనివారం పెంటపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆకాశం మబ్బులతో నిండిపోయింది. అత్తిలి మండలం, దువ్వ ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. అలాగే నిడమర్రు, గణపవరం మండలాల్లో కొన్ని గ్రామాల్లోనూ చినుకులు పడ్డాయి. దీంతో రైతులు కోత యంత్రాల ద్వారా మాసూళ్లను వాయిదా వేశారు. నవమి, దశమి రోజుల్లో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు.

రయ్.. రయ్..

ప్రాణాలు పోతున్నాయ్ !

టెర్రర్ డ్రైవింగ్

- బైక్‌లపై మైనర్లు, ఆకతాయిల హల్‌చల్
- ప్రాణాంతకంగా పరిణమిస్తున్న ర్యాష్ డ్రైవింగ్
- వాహనచోదకులు, ప్రయాణికుల బెంబేలు
- కఠిన చట్టాలున్నా చొరవ చూపని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో మూడు నెలల్లో 13 మందికి పైగా మృత్యువాత



పెనుగొండ-మార్టేరు రోడ్డులో ప్రమాద దృశ్యం (ఫైల్)



మైనర్ల డ్రైవింగ్‌ను తీవ్ర ఉల్లంఘనగా తీసుకున్న హైదరాబాద్ పోలీసులు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తమ చేతికి చిక్కిన మైనర్ల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుని వారి తండ్రులపై కేసులు నమోదుచేశారు. వీటికి సంబంధించి 55 మంది తండ్రులకు ఒకటి నుంచి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ ఇటీవల న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి.

ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వారికి నివాళులర్పిస్తూ రోడ్ల పక్కన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ మధ్యకాలంలో ఫ్లెక్సీల్లో వయసు పైబడిన వారి కంటే 20 నుంచి 25 ఏళ్లలోపు యువకుల ఫొటోలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. **వీటిలో అధిక శాతం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న వారే ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.**

సాక్షి, భీమవరం: జిల్లాలోని రోడ్లపై రయ్‌మంటూ హల్‌చల్ చేస్తున్న మైనర్లు, ఆకతాయిల కట్టడికి చర్యలు నామమాత్రంగానే ఉండటంతో వారి ఇష్టారాజ్యంగా మారింది. భీమవరంలోని విష్ణు కళాశాల రోడ్డు, ఎస్ఆర్‌కేఆర్ కాలేజీ రోడ్డు, తణుకులోని రాష్ట్రపతి, వేల్పూరు, సొసైటీ, ఉండ్రాజవరం రోడ్లు, తాడేపల్లిగూడెంలో శశి కళాశాల, నిట్ కళాశాల రోడ్లు, నరసాపురంలో వైఎన్ కళాశాల, గోదావరి బండ్, వలందర్ రేవు ఏరియా, రుస్తుంబాద రోడ్లు, పాలకొల్లులోని దిగమర్రు, దొడ్డిపట్ల రోడ్లల్లో ఆకతాయిలు మోటారు బైక్‌లపై విన్యాసాలు చేస్తూ హడలెత్తిస్తున్నారు. వీరిలో అధికంగా మైనార్టీ తీరని వారు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారే ఉంటున్నారు. హైవేల్లో అయితే వీరి వేగానికి అంతే ఉండటం లేదు.

జైలు శిక్షలు ఉన్నా..

16 ఏళ్లలోపు వారు ఎలాంటి వాహనాలనూ నడపకూడదు. 18 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే గేర్ల వాహనాలు నడిపేందుకు అర్హులు. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 199ఏ ప్రకారం మైనర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనాన్ని ఇచ్చిన పేరెంట్స్/ వాహన యజమానికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించే అవకాశం ఉంది.

13 మందికి పైగా మృతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మూడు నెలల్లో భీమవరం, నూజివీడు, సీసలి, జంగారెడ్డిగూడెం, మొగల్తూరు తదితర చోట్ల జరిగిన వేర్వేరు మోటారు సైకిళ్ల ప్రమాదాల్లో 13 మందికి పైగా మృత్యువాత పడ్డారు. వీరిలో వాహనాన్ని నడుపుతున్న వారు కొందరైతే, దారిన వెళుతున్న వారు మరికొందరు. పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా బయటే సెటిల్‌మెంట్ చేసుకున్న ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారు ఎందరో ఉన్నారు. జిల్లా పోలీస్, రవాణశాఖ అధికారులు పూర్తిస్థాయిలో రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించడం ద్వారా ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలపై అవగాహన లేమి

కుమారుడు మోజు పడ్డాడనో, చెప్పినట్టుగా చదువుకుంటాడనో, తమ స్టేటస్ సింబల్‌గానో.. ఏదైనా గాని కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల వయసు, సామర్థ్యానికి మించి ఆధునాతన బైక్‌లను కొనిస్తుంటే, మరోపక్క ఆకతాయిలు జీరో ఫైనాన్స్‌పై వాహనాలు తీసుకుని హల్‌చల్ చేస్తున్నారు. మట్టి రోడ్డులో ఎలా నడపాలి? తారు రోడ్డుపై ఇసుక ఉంటే ఎలా కంట్రోల్ చేయాలి? ఏ రోడ్డులో ఎంత వేగంతో వెళ్లాలి ? ట్రాఫిక్ నిబంధనలేమిటి? మలుపుల వద్ద ఎటువంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి? ఇవేమీ అవగాహన లేకుండానే బైక్‌లపై చక్కర్లు కొడుతున్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రుల భయం లేకపోవడమో, తమను ఎవరూ ఏమీ చేయరన్న భావనతోనో ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు కూర్చుని నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఒక్కోసారి అదుపుతప్పి వారు ప్రమాదానికి గురై కన్నవారికి తీరని శోకాన్ని మిగల్చడంతో పాటు దారిన వెళ్లే అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



మైనర్లు, ర్యాష్ డ్రైవింగ్‌లను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా అంతటా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. మూడు నెలల్లో జిల్లాలో వెయ్యికి పైగా కేసులు నమోదుచేశాం.

– ఉమామహేశ్వరరావు, జిల్లా రవాణశాఖ అధికారి, భీమవరం

ఆక్వాపై కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రొయ్య రేటు పతనమై ఆక్వా రైతులు విలవిల్లాడుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనాలోచిత నిర్ణయాలతో ఆక్వా రైతులు రోడ్డున పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని, ధరలు పతనమై రైతులు అల్లాడుతున్నారన్నారు. గతంలో టమాటా రైతుల మాదిరిగా రొయ్యలను రోడ్డున పారవేసే పరిస్థితులు రాకుండానే కూటమి ప్రభుత్వ ఎంపీలు పార్లమెంట్‌లో గళాన్ని వినిపించాలని సూచించారు. తక్షణమే రొయ్యల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

10 నెలల్లో రూ.1.50 లక్షల కోట్ల అప్పు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా అన్యాయాలు, అక్రమాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని కారుమూరి విమర్శించారు. 10 నెలల్లో రూ.1.50 లక్షల కోట్ల అప్పులు చేశారని దుయ్యబట్టారు. సంపద సృష్టిస్తానని గద్దెనెక్కి.. ఇప్పుడు ప్రజల తలను తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు చెంపపెట్టు

రాష్ట్రంలో మద్యం అమ్మకాలు దారుణంగా ఉన్నాయని, ఇది మనకు మంచిది కాదంటూ కూటమి ఎమ్మెల్యే కొలికిపూడి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని కారుమూరి అన్నారు. ప్రజలకు మంచి పాలన అందించాలని మనకు ఓట్లేశారే కానీ, జగన్‌ని తిట్టమని మనకు ప్రజలు ఓట్లేయలేదని గుర్తుంచుకోవాలని అనడం కూటమి ప్రభుత్వ పనితీరును తెలుపుతుందని విమర్శించారు.

అమాత్యులకు రోజుకు రూ.1.50 లక్షలు..

తణుకులో పేకాట, గుండాట, క్రికెట్ బెట్టింగులు జోరుగా సాగుతున్నాయని, దీని కోసం అమాత్యులకు రోజుకు రూ.1.50 లక్షలు ముట్టచెబుతున్నట్టుగా ప్రజలే చెప్పుకొంటున్నారని కారుమూరి విమర్శించారు. మద్యం దుకాణాల్లో పగలూ రాత్రీ అమ్మకాలు చేయిస్తూ పావలా వాటా, తాజాగా కమీషన్ గుంజుతున్నారని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో మద్యం దుకాణాల వద్ద జరుగుతున్న దారుణాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఎంపీపీ ఉప ఎన్నికల్లో అత్తిలిలోని తన ఇంటిని చుట్టుముట్టి ఎంపీటీసీ సభ్యులను ఎన్నికల కేంద్రానికి వెళ్లకుండా అడ్డుకున్న తీరు దారుణమన్నారు. మద్యం అక్రమ అమ్మకాలకు సంబంధించి ఎక్సైజ్ అధికారులకు 20 రోజులు సమయం ఇస్తున్నానని, తీరు మారకపోతే తామే రంగంలోకి దిగి నైట్ పాయింట్లు, బెల్టుషాపుల వద్దకు వెళ్లి అధికారులకు సమాచారం ఇస్తామని హెచ్చరించారు.

వక్ఫ్ బోర్డు బిల్లు దుర్మార్గం

సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మహిళా మాజీ డైరెక్టర్ మెహర్ అన్సారీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లుకు ముస్లింతా వ్యతిరేకంగా ఉన్నా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టడం దుర్మార్గమని అన్నారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట ప్రణాళిక

భీమవరం (ప్రకాశంచౌక్): వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సరఫరాలో పటిష్ట ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, పీఎం సూర్యఘర్, పింక్ టాయిలెట్స్ ఏర్పాటు, పార్కుల అభివృద్ధి అంశాలపై ఆయన సమీక్షించారు. జిల్లాలో తాగునీటికి కొరత లేకుండా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను పూర్తిగా నింపుకోవాలన్నారు. మినరల్ వాటర్ యూనిట్లను తనిఖీ చేసి నాణ్యమైన నీరందించేలా చూడాలన్నారు. ఎండల దృష్ట్యా జన సమూహాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో షామియానాలు, చలివేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కమిషనర్లు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో గుబులు

- పగలు ఉక్కపోత.. రాత్రిళ్లు చిరుజల్లులు
- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- ఆందోళనలో వరి రైతులు
- జిల్లాలో కోతకు సిద్ధంగా దాళ్వా పంట



పంజా వేమవరంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు

భీమవరం: ఆరుగాలం కష్టించి పండించిన దాళ్వా పంట చేతికి వచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు రైతులను ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురవడం, జిల్లాలో ఈదురుగాలులు, చిరుజల్లులు పడటంతో దిగాలు చెందుతున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.15 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పీఆర్–126, ఎస్ఎల్–10 వంటి రకాలు మాసూళ్లు చేస్తుండగా ధాన్యం దిగుబడి ఆశాజనకంగా ఉంది. వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా వరి మాసూళ్లు ముమ్మరం కానున్నాయి. దాళ్వా సీజన్ ప్రారంభంలో రైతులు సాగునీటి ఎద్దడి, పైరుపై చీడపీడలు, ఎలుకల బెడదతో ఇబ్బందులు పడ్డారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. ఈ నేపథ్యంలో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దాళ్వా పంట పండించారు. ప్రస్తుతం దాదాపు అన్ని మండలాల్లో గింజలు ఎర్రముక్కలు పడే దశలో ఉండగా ముందుగా నాట్లు వేసిన రైతులు మాసూళ్లకు సన్నద్ధమవుతున్నారు. ముందుగా మాసూళ్లు చేసిన రైతులు కొట్టు, పొట్టు ధాన్యం ఎకరాకు 60 బస్తాలకు పైగా దిగుబడి వస్తున్నట్టు చెబుతుండటంతో మిగిలిన రైతులు దాళ్వా పంటపై ఆశలు పెట్టుకున్నారు.

ఉపరితల ఆవర్తనంతో ఆందోళన

అండమాన్ సమీపంలో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది అల్పపీడనంగా బలపడే అవకాశాలున్నందున కోస్తా జిల్లాలో వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. పగలు అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా రాత్రిళ్లు ఈదురు గాలులు, చిరుజల్లులు పడుతున్నాయి. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టగా.. కోతలకు మరో రూ.5 వేలు ఖర్చవుతుందని, ఈ సమయంలో వర్షాలు పడితే తీవ్రంగా నష్టతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈదులుగాలులతో పైరు నేలనంటి గింజలు రాలిపోవడంతో మాసూళ్ల ఖర్చులు పెరిగిపోతాయంటున్నారు.

క్లుప్తంగా

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి ఆలయంలో భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ సెలవుదినం కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో రద్దీగా మారాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

విద్యార్థి విజయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ

తాడేపల్లిగూడెం: విద్యార్థి విజయాల్లో తల్లిదండ్రులదే కీలకపాత్ర అని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ అన్నారు. శశి విద్యాసంస్థలో ఆరు నుంచి పదో తరగతి, ఇంటర్‌లో చేరబోయే విద్యార్థులకు ఐఐటీ, నీట్‌పై శనివారం ఏర్పాటుచేసిన అవగాహన సభలో ఆయన మాట్లాడారు. సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఐక్యూ ఆధారంగా మార్కులు, ర్యాంకులు సాధిస్తారని.. ఈ విషయంలో తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. గొప్పవాళ్లంతా మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారేనని, వారి స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, క్యాంపస్ ఇన్‌చార్జి కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నిరాశేనా?

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ప్రశ్నలకు సమాధానాలు కరువు



పోలవరం ప్రాజెక్ట్ వద్ద ముఖ్యమంత్రికి నిర్వాసితుల సమస్యను వివరిస్తున్న కివ్వాక నిర్వాసితుడు (ఫైల్)

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టుతో నిర్వాసితులవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను అన్నివిధాల ఆదుకుంటామని ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. బహిరంగ వేదికల సాక్షిగా ప్రభుత్వ పెద్దలు నిర్వాసితులనుద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం సర్వం త్యాగం చేస్తున్న త్యాగధనులంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారే తప్ప నిర్వాసితుల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి ఎప్పటికి సమాధానం లభిస్తుందోనని విలీన మండలాల నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. ఆ ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉంటుందా? అన్న అనుమానం నిర్వాసితులకు లేకపోలేదు.

మిగులు భూముల మాటేంటి?

ఇటీవల పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ముఖ్యమంత్రి 2027 కల్లా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు తరలిస్తామని వ్యాఖ్యానించారు. వివిధ గ్రామాలలోని భూములకు పరిహారం చెల్లించగా ముంపులో లేని భూములు(మిగులు భూముల) విషయమై ప్రభుత్వం నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చేస్తుందన్న విషయమై స్పష్టత ఇవ్వలేదు. దీంతో అరకొర పరిహారం తీసుకుని మిగులు భూములు వదులుకుని నిర్వాసిత కాలనీలకు ఎలా వెళ్లేదని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.

పునరావాస కాలనీల్లో ఉపాధి ఎలా?

పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం ఇంతవరకు వ్యవసాయమే ఆధారంగా జీవించిన నిర్వాసితులకు జీవనోపాధి ఎలా కల్పిస్తుందన్న విషయమై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో పునరావాస కాలనీలకు నిర్వాసితులను తరలించి వదిలేస్తే తమ భవిష్యత్తు ఏంటని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.

45 కాంటూర్ వరకు నిర్మాణం ఉంటుందా?

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం 41.15 కాంటూర్ వరకే పరిమితం అంటూ ఓ పక్క కేంద్ర ప్రభుత్వ పెద్దలు పార్లమెంట్ సాక్షిగా చెప్పిన విషయమై పత్రికలు ప్రచురించగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 45 కాంటూర్ వరకు నిర్మిస్తామంటూ నమ్మబలుకుతుంది. 45 కాంటూర్ నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం లేని మాటలు చూస్తే అసలు 45 కాంటూర్ నిర్మాణం ఉంటుందా, లేదా అన్న ప్రశ్న నిర్వాసితులను వేధిస్తోంది.

45 కాంటూర్ ప్రజలకు ఉపాధి ఎలా?

ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిధిలో ముంపు పేరుతో దాదాపు మండలంలోని అన్ని గ్రామాల్లో 70 శాతం భూములను ప్రభుత్వం సేకరించి పరిహారం చెల్లించింది. దీంతో ఆ భూములు ప్రభుత్వ పరమయ్యాయి. ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించకపోవడంతో ఆ భూములను నేటివరకు భూ యజమానులే సాగు చేసుకున్నారు. కొంతమంది పెద్దరైతులు వారి భూములను ఇతరులకు జామాయిల్ సాగుకు కౌలుకు ఇచ్చారు. జామాయిల్ సాగుతో ఇప్పటికే ఉపాధి లేక పేదలు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం పరిహారం ఇస్తుందిలే అన్న ఆశతో ఇన్నాళ్లు కాలాన్ని నెట్టుకొచ్చారు. ఇప్పుడు 41 కాంటూర్ వరకే పరిహారం చెల్లించి 45 కాంటూర్‌కు పరిహారం చెల్లింపు విషయమై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో పరిహారం ఇచ్చే వరకు తమకు ఉపాధి ఎలా అని 45 కాంటూర్‌కు చెందిన చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు.

తరలించే నాటికి 18 ఏళ్లుంటే పరిహారం ఇస్తారా?

ఆర్ అండ్ ఆర్ పరిహారానికి సంబంధించి 2017 జూన్‌ను కటాఫ్ తేదీగా ప్రకటించారు. అప్పటికి 18 ఏళ్లు నిండిన వారందరికి ప్రభుత్వ ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించాలి. ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ పరిహారాన్ని 2025లో అంటే 7 సంవత్సరాల తరువాత చెల్లించింది. దీంతో ఆ కటాఫ్ డేట్ కారణంగా చాలా మందికి అన్యాయం జరుగుతుంది. దీంతో నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించే నాటికి 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధికి భూమి చూపించాలి



ముంపు పేరుతో భూములను సేకరించిన ప్రభుత్వం 45 కాంటూర్‌లోని నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ పరిహారం ఎప్పుడు చెల్లిస్తుందన్న విషయమై స్పష్టమైన హామీ ఇవ్వడం లేదు. ఇప్పటికే ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న 45 కాంటూర్ నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఉపాధి చూపించే బాధ్యత ప్రభుత్వానిదే. ఉపాధి నిమిత్తం సాగు భూమి చూపించాలి.

–కురాకుల బాబురావు, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా అధ్యక్షుడు

మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలి



మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటే తప్ప నిర్వాసితులకు న్యాయం జరగదు. ఇప్పటికే 45 కాంటూర్ నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో నిర్వాసితులు అయోమయంలో ఉన్నారు. వారికి న్యాయం జరగాలంటే మండలాన్ని యూనిట్ గా తీసుకుని, పునరావాస కాలనీలకు తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు పరిహారం చెల్లించాలి.

– మైసొల్లి వెంకటాచారి, సీపీఐ మండల కార్యదర్శి, కుక్కునూరు

కోర్సుల మూసివేత తగదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : తక్కువ మంది విద్యార్థులు ఉన్నారనే నెపంతో కొన్ని ఇంటర్ కళాశాలల నుంచి కొన్ని గ్రూపులను ఎత్తివేసి అక్కడి ఉద్యోగులను మరోచోట సర్దుబాటు చేయడం తగదని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్వీర్యం చేయడంలో భాగమేనని భావిస్తున్నామన్నారు. విద్యావ్యవస్థను లాభాపేక్ష దృష్టితో చూడకూడదని, మారుమూల ప్రాంతాలలో విద్యార్థులు అతి తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి విద్యను నిరాకరించే ఈ విధమైన చర్యలు తగదన్నారు. ఈ చర్యలు కార్పొరేట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడమే అవుతుందని, అంతేకాక దాదాపు 25 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ వ్యవస్థలో పనిచేస్తున్న అనేక మంది అధ్యాపకులు తమ ఉద్యోగాలను కోల్పోయే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ సర్దుబాటు ప్రక్రియను ఆపాలని, విద్యావ్యవస్థను లాభాపేక్షతో కాకుండా ప్రజలందరికీ విద్యను అందించే బాధ్యతతో చూడాలని, ప్రతి జూనియర్ కళాశాలలోనూ సైన్స్, ఆర్ట్స్ గ్రూపులను ఏర్పాటు చేసి తగిన సౌకర్యాలు కల్పించి అధ్యాపకులను నియమించాలన్నారు. అఖిల భారత ఉపాధ్యక్షుడు ఏ.చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు కే.వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవిందరాజులు, రామశేషయ్య, వెంకట రెడ్డి, మోహన్, రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్యం, రాష్ట్ర కోశాధికారి వెంకటరమణ తదితరులు ప్రకటన విడుదల చేశారు.

అడవి మానులే దేవుళ్లు

- సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామిగా మానులకే పూజలు
- నాయక్ పోడు గిరిజనుల తరతరాల నాటి ఆచారం



బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురంలో ఏర్పాటు చేసుకున్న రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడి చెట్ల నమూనాలు(ఫైల్)



సీతారాములకు పూజలు చేస్తున్న గిరిజనులు(ఫైల్)

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం మండలంలో ఉన్న లక్ష్మీపురంలో నాలుగు రకాల చెట్ల మానులు అడవి నుంచి తీసుకొచ్చి రాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయుడిగా ఏర్పాటు చేసుకొని వాటినే పూజిస్తూ వస్తున్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. గ్రామంలో రామాలయం ఏర్పాటు చేసినా తాము చెట్లనే దేవుళ్లుగా కొలుస్తామంటూ గిరిజనులు చెబుతున్నారు. బుట్టాయగూడెం మండలంలోని లక్ష్మీపురంలో 50 కుటుంబాలకు చెందిన నాయక్‌పోడు గిరిజనులు నివసిస్తున్నారు. ఈ గ్రామ ఇలవేల్పుగా గంగానమ్మ అమ్మ వారిని పూజలు చేసే గిరిజనులు తదుపరి శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడినే అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఇక్కడ చిత్రపటాలు, విగ్రహాలు ఉండవు. శ్రీరామనవమికి ముందు రోజు గ్రామస్తుల్లో పెద్దలు, యువకులు అడవిలోకి వెళ్లి 4 రకాల చెట్ల మానులు సేకరించి వాటిని ప్రత్యేక రూపంలో మలిచి ఘనంగా పూజలు చేస్తుంటారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

మానులే దేవుళ్లు

శ్రీరామనవమికి ముందు ఉత్సవ కమిటీ సభ్యులుగా ఉన్న పెద్దలు, యువకులు అడవికి వెళ్లి చెంద్ర, పాల, ఊడిగ, రావి చెట్ల మానులను సేకరిస్తారు. శ్రీరాముడికి చెంద్ర, సీతాదేవికి పాల, లక్ష్మణుడికి ఊడిగ, ఆంజనేయుడికి రావి చెట్టు తీసుకువచ్చి వాటిని చెక్కించి గ్రామం మధ్యలో ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ఇలా ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజు సీతారామ కల్యాణాన్ని ఘనంగా జరుపుతున్నారు.

నాటి ఆచారాలతో శ్రీరామనవమి వేడుకలు



లక్ష్మీపురం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను తరతరాల నాటి ఆచారాలతో నిర్వహిస్తాం. అడవిలో 4 రకాల చెట్లను తీసుకొచ్చి శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడిగా కొలుచుకోవడం మాకు ఆనవాయితీ. అదే మాకు జయం, మా గ్రామానికి సురక్ష. ఈ సంప్రదాయాన్నే మేము కొనసాగిస్తాం.

– కపిలవాయి హరిసూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

అడవి మానులే దేవుళ్లు



అడవి మానులను దేవుళ్లుగా పూజిస్తాం. ఈ ఆచారం మా పూర్వీకుల నుంచీ వస్తోంది. దానినే మేము ఆచరిస్తున్నాం. ఏటా శ్రీరామనవమికి ముందు అడవికి వెళ్లి నాలుగు రకాల అడవి చెట్లను తీసుకొచ్చి, వాటిని చెక్కి శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామిగా ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తాం, నవమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం

– గురువింద కొర్రయ్య, ఉత్సవ కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

బంగారు నగల చోరీ



చోరీ జరిగిన బైనాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలిలో ఒంటరిగా ఉంటున్న మహిళ ఇంట్లో బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం వడాలికి చెందిన బత్తుల నాగమణి భర్త చనిపోగా ఒంటరిగా జీవిస్తోంది. గత నెల 16న అనారోగ్యానికి గురి కావడంతో గుడివాడలోని ఆసుపత్రికి వెళ్లి అక్కడే ఉంటున్న తల్లిదండ్రుల వద్ద ఉండి శనివారం ఉదయం ఇంటికి తిరిగివచ్చింది. ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో బీరువా తెరిచి లోపల ఉన్న 11 కాసుల బంగారు వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై ఫిర్యాదు చేయగా క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఎస్సై వీరభద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆకివీడు: జాతీయ రహదారిపై జెడ్పీ హైస్కూల్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనగా.. ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పెదపేటకు చెందిన నేతల మైకేల్(40) శనివారం మధ్యాహ్నం రోడ్డు టర్నింగ్ తిరుగుతుండగా కైకలూరు వైపు నుంచి మరో బైక్‌పై సాయి అనే యువకుడు వేగంగా వస్తూ మైకేల్‌ను ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన మైకేల్ తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ బీ.సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మైకేల్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. మైకేల్ మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు అంబటి రమేష్ సందర్శించి, కుటుంబానికి అండగా నిలిచారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

ఆకివీడు : స్థానికంగా ఇద్దరు యువతులు శుక్రవారం అదృశ్యమయ్యారు. స్థానిక వడలి వారి వీధిలో నివసిస్తున్న యువతి రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని, తెల్లవారాక చూస్తే కన్పించకపోవడంతో ఆమె తల్లి శనివారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. స్థానిక పెదపేటకు చెందిన యువతి శుక్రవారం డిగ్రీ పరీక్షలు రాయడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద, ఇతర ప్రాంతాల్లో వెతికినా కన్పించలేదు. శనివారం ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

భీమవరం : భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నరసయ్య అగ్రహారానికి చెందిన బీవీ నర్సింహరావు మెడలోని 12 గ్రాముల బంగారు గొలుసు దొంగిలించిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ ఎం నాగరాజు చెప్పారు. నర్సింహరావు ఈ నెల 2న నరసయ్య అగ్రహారం నుంచి కుముదువల్లిరోడ్డులోని ఏఎంసీ వైపు వాకింగ్‌కు వెళుతుండగా పట్టణంలోని వెంకయ్యవీధికి చెందిన ఎల్.ఏడుకొండలు, రాయలం గ్రామానికి చెందిన సీహెచ్ రమేష్ మోటర్ సైకిల్‌పై వచ్చి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజు చెప్పారు.

రొయ్యలపై దిగుమతి సుంకం రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతవుతున్న రొయ్యలపై అమెరికా 26 శాతం సుంకం విధించడం దుర్మార్గమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక అన్నే భవనంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కర రావు అధ్యక్షతన అమెరికా దిగుమతి సుంకాలు – భారతదేశ వ్యవసాయ రంగంపై ప్రభావం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. అమెరికా ప్రపంచ దేశాలపై దిగుమతి సుంకాల భారాలు వేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే కలుగజేసుకుని ట్రంప్ విధించిన సుంకాన్ని రద్దు చేయించాలని కోరారు. లేదంటే ఆ ప్రభావం ఇక్కడి రొయ్యల గిట్టుబాటు ధరలపై పడుతుందన్నారు. ట్రంప్ తాజాగా విధించిన సుంకంతో కలుపుకుంటే అమెరికా 35.65 శాతం పన్ను విధిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆక్వా రైతులు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారని చెప్పారు. ఆక్వాతో పాటు ఇతర పంటల రైతులు కూడా అమెరికా దిగుమతి సుంకం వలన నష్టపోతారని చెప్పారు.

భగవద్గీత పోటీలు ప్రారంభం



భగవద్గీత శ్లోక పఠన పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనంద గీతా యజ్ఞం రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలు శనివారం ప్రారంభించినట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. రెండు రోజులపాటు ఈ పోటీలు నిర్వహిస్తారు.ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను 4 విభాగాల్లో నిర్వహించారు. సబ్ జూనియర్స్ విభాగంలో 21 నుంచి 30 శ్లోకాలు, జూనియర్స్ 51 నుంచి 70 శ్లోకాలు, సీనియర్స్ 76 నుంచి 108 శ్లోకాలు, విశిష్ట ప్రతిభా విభాగం అన్ని వయసుల వారికి మొత్తం 108 శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు. చైర్మన్ కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ గెలుపొందిన వారికి 13న ఆనందరాజు వర్ధంతి సభలో ప్రముఖుల సమక్షంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాయన చంద్రజీ, కంతేటి వెంకటరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో జూదరుల గుర్తింపు



డ్రోన్ ద్వారా పేకాడుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఉండి: ఉండి పట్టణ శివారు పంట పొలాల వద్ద పేకాట ఆడుతున్న 9 మంది వక్తులను డ్రోన్ ద్వారా గుర్తించి, కేసులు నమోదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, జూదం వంటి పలు చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. అందులో భాగంగా శనివారం ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ఎండీ నజీరుల్లా, సిబ్బంది డ్రోన్ ద్వారా గస్తీ నిర్వహిస్తున్న సమయంలో కోలమూరు, పాందువ్వ గ్రామాల శివారు నిర్మానుష్య ప్రదేశాలలో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,390 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో పోస్టల్ ఉద్యోగి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుదాఘాతంతో ఓ పోస్టల్ ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన తెలంగాణలోని జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగింది. సీఐ జి.వేణు కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా కైకలూరు మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన బోడావుల నాగదుర్గబాలాజీ(27) గతేడాది నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నా డుజీ. రోజూ మాదిరి శనివారం ఉదయం స్నానం చేసేందుకు నీటిని పట్టుకునేందుకు మోటారు ఆన్ చేశాడు. నీరు రాకపోవడంతో ఏమైందో చూసేందుకు మోటారును చేతితో ముట్టుకున్నాడు. విద్యుదాఘాతానికి గురై కేకలు వేస్తూ కిందపడ్డాడు. ఇంటిలో ఒక్కడే ఉండడంతో ఎవరూ గమనించలేదు. కేకలు విన్న సమీపంలో తాపీ కార్మికులు పక్కవారికి చెప్పారు. వారు వెళ్లి చూడగా కిందపడి ఉన్నాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఎలుకల మందు తిని వ్యక్తి మృతి

కైకలూరు: మద్యం మత్తులో ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ వ్యక్తి మరణించిన ఘటన కలిదిండి మండలం పడమటిపాలెంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కసేటి శ్రీనివాసరావు(40) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరుచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం మత్తులో అనేక సార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడు. గురువారం రాత్రి ఎలుకల మందు తిన్నాడు. మద్యం తాగడం వల్ల వాంతులు చేసుకుంటున్నాడని భావించారు. అయితే ఎలకల మందు తిన్నానని చెప్పడంతో శుక్రవారం హుటాహుటీన భీమవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఫోర్జరీ సంతకాలతో నిధులు స్వాహా

ద్వారకాతిరుమల: ఫోర్జరీ సంతకాలు పెట్టి ద్వారకాతిరుమల గ్రామ సంఘం-1 లో నిధులను దోచేశారు. వెలుగు సీసీ కె.హస్సెన్మియా గతేడాది నవంబర్‌లో టి.నరసాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చాడు. గతేడాది డిసెంబర్‌లో ద్వారకాతిరుమల-1 ద్వారా గ్రామ సంఘం లీడర్ల సంతకాలను ఫోర్జరీ చేసి బ్యాంకు ఖాతాలోని రూ. 1.20 లక్షలను స్వాహా చేశాడు. ఈ ఏడాది జనవరి 13న మరో రూ. 90 వేలను డ్రా చేసుకున్నాడు. గ్రామ సంఘ సభ్యులు ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. ఆమె నిలదీయగా, అతడు తప్పును ఒప్పుకుని, నగదును జమ చేస్తానని రాసిచ్చాడు. జనవరి 20న హస్సెన్మియా రూ. 20 వేలు జమ చేశాడు. మిగిలిన సొమ్మును జీతం నుంచి రికవరీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఫిబ్రవరిలో అతడిని సస్పెండ్ చేస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి ఇంత వరకు అతడి నుంచి పైసా కూడా రికవరీ కాలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు


విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్రఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందారు. సుమారుగా 55 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరి మరణించినట్లుగా ఆస్పత్రి వర్గాలు తెలిపినట్లు తణుకు పట్టణ పోలీసులు పేర్కొన్నారు. మృతుని గుర్తించగలిగిన వారు తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం తెలపాల్సిందిగా కోరారు.

దేశప్రగతికి పరిశోధనలు కీలకం


విద్యార్థులతో ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ డెవలప్‌మెంటు డాక్టర్ సందీప్

తాడేపల్లిగూడెం: దేశప్రగతికి పురోభివృద్ధికి పరిశోధనలు కీలకమని ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంటు డాక్టర్ వి.సందీప్ అన్నారు. రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎంఎస్సీ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులు శనివారం నిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ పరిశోధనలకు పునాది సైన్సు అన్నారు. శాస్త్రవేత్తలు ఒక గొప్ప వైజ్ఞానిక ప్రాజెక్టు కోసం పరిశోధనశాలలో ఏళ్ల తరబడి అంకితభావంతో పనిచేస్తారన్నారు. వారి స్ఫూర్తితో విద్యార్థులు కళాశాల స్థాయిలోనే కొత్త ఆలోచనలు చేయాలన్నారు. విద్యార్థులు సైన్సు ప్రయోగశాలలో పలు విషయాలను తెలుసుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీవారు


వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారు శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని గత వారం రోజులుగా స్వామివారిని విశేషంగా అలంకరిస్తు న్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి


స్థానిక మహిళలకు, సిబ్బందికి తడి, పొడి చెత్త అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుర ప్రజలు తమ ఇళ్లవద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బంది అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు సూచించారు. శనివారం పట్టణంలో పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త సేకరణ వాహనాలకు, తోపుడు బండ్లకు మైక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీబీఆర్ వార్షికోత్సవ వేడుకలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు జాతీయరహదారికి ఆనుకొని టీబీఆర్ డిఫెన్స్ అకాడమీ స్థలంలో శనివారం రాత్రి టీబీఆర్ సైనిక స్కూల్ 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ సైనికసంక్షేమసంఘ ప్రతినిధి తనబుద్ధి భోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశభక్తిని ప్రతీ విద్యార్థి పుణికి పుచ్చుకోవాలన్నారు. ఒక ప్రత్యేక ఆశయంతో నడుస్తున్న స్కూల్‌ను ప్రతీఒక్కరూ ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. పలు ప్రాంతాల నుంచి సైనికసంక్షేమసంఘ సభ్యులు, మాజీ సైనికుల కుటుంబాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకుడు బాబు జగ్జీవన్‌రామ్


తణుకు అర్బన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీమంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు


తాడేపల్లిగూడెం అర్బన్: 12వవార్డులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు అర్బన్: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జీవిత విధానం స్ఫూర్తిదాయకమని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వారి హక్కుల కోసం పోరాడి వారికి తగిన గుర్తింపు తీసుకువచ్చిన మహానుభావుడని కొనియాడారు. దళిత వర్గంలో తొలి ఉప ప్రధానిగా విధులు నిర్వర్తించి సమాజ మార్పు కోసం అహర్నిశలూ పోరాడిన బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను యువత ముందుకు తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పొట్ల సురేష్, ఉండవల్లి జానకి, షేక్ ఫహీమా, డీజే అమూల్యారావు, జల్లూరి జగదీష్, వీరమల్లు ఫణీంద్రకుమార్, కరిబండి రాజేష్, కొమ్మోజు రామకృష్ణ, పార్థసారధి, షేక్ బాజీ, జిలానీ, బెజ్జవరపు సాక్షి, రంభ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తేతలిలో..

తేతలిలో బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆదర్శనీయమైన ఆయన జీవితగాధను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయంతి వేడుకల నిర్వాహకులు మానేపల్లి ప్రభాకరరావు, మానేపల్లి సంపతరావు, తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, సరెళ్ల వీరతాత, దారం శ్రీను, జాలిమ్ వెంకటేశ్వరరావు, నక్కా ధనరాజు, పేరిచర్ల సతీష్‌రాజు, అధికసంఖ్యలో యువత పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ నేటి యువతకు ఆదర్శం

తాడేపల్లిగూడెం అర్బన్ : బాబూ జగ్జీవన్‌రావు జీవతం నేటి యువతకు ఆదర్శనీయమని ఆయన అడుగుజాడల్లో పయనించి బలహీన వర్గాలకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. బాబూజగ్జీవన్ రావు 117వ జయంతి సందర్భంగా స్థానిక 12వ వార్డులోని అరుందతి పేటలో బాబూ జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 30 సంవత్సరాలపాటు కేంద్ర మంత్రిగా కొనసాగిన బాబూ జగ్జీవన్‌రావు వివిధ ప్రభుత్వ విభాగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేశారన్నారు. నిమ్నవర్గంలో పుట్టి ఉన్నత విద్యను అభ్యసించి విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని నిరూపించిన అణగారిన వర్గాల నాయకుడిగా పేరు గాంచారన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి


పెంటపాడు: కునాకరపేట వద్ద జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యూత్ సంఘ సభ్యులు


తాడేపల్లిగూడెం రూరల్: రామన్నగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్

ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీరాముల విజయలక్ష్మి, సత్యప్రియ, చామన సూర్యచంద్రరావు, కనుపూరి ఉదయభాస్కర్, కాటంరాజు, యు రవీంద్ర, కొడమంచిలి ముత్యం, ఎం.రామకృష్ణ, బొద్దాని శ్రీనివాస్, ఆరేపల్లి రవి పాల్గొన్నారు.

రామన్నగూడెంలో జగ్జీవన్‌రామ్ జయంతి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, సాంఘీక అసమానతలు నివారణకు జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. మాజీ సర్పంచ్ కాకర్లమూడి వెంకట్రావు, దళిత సేన ఏలూరు జిల్లా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, దళిత సేన ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. పడాల, కృష్ణాయపాలెం, కొత్తూరు తదితర గ్రామాల్లో జరిగిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని దళితుల అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలను కొనియాడారు. తొలి కార్మిక శాఖ మంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప కులపతి డాక్టర్ కే.గోపాల్ పాల్గొని మాట్లాడుతూ సామాజిక సమానత్వానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం జగ్జీవన్‌రామ్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, విద్యార్థి సంబంధాధికారి డాక్టర్ నారం నాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. పుల్లాయగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్పీటీసీ సభ్యుడు మార్లపూడి సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు బాబు జగ్జీవన్ రామ్

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ అధ్యక్షత వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమల వేసి నివాళ్లలర్పించారు. పదకొండవ అడిషనల్ జడ్జి సికందర్ బాషా, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ సవిల్ జడ్జి సూర్య కిరణ్, ఎస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి అరుంధతిలు పాల్గొన్నారు. వక్తలు జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలను వెల్లడించారు. జనరల్ సెక్రటరీ పెదగాడి భూపాల్, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, కోశాధికారి ఫరోత్‌బాబు, న్యాయవాదులు మణిరాజు, శివకుమార్, భద్రుడు, సత్యవాణి ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో...

జగ్జీవన్‌రాం జయంతిని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనోటరింగ్ కమిటీ సభ్యులు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి నివాళ్లలర్పించారు. జీవిత విశేషాలను వివరించారు. పొన్నమండ బాలకృష్ణ, గోపి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో...

బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ ఎం.యేసుబాబు, ఎంఈ వై.వెంకటరమణ, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎస్.రాజు, శానటరీ ఇనస్పెక్టర్లు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయం సెక్రటరీలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

దళిత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో యాగరపల్లిలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లలర్పించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నరసాపురం పార్లమెంట్ మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు దువ్వా శ్రీను, రామగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

స్థానిక ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడు తిరుమళ్ళ సూరిబాబు, పట్టణ ఎస్సై నాగరాజు, బి.రాజేష్, ప్రవా శ్రీనివాస్, బాకా వెంకటేశ్వరరావు, నరసింహం, రామరాజు పాల్గొన్నారు.

ఘనంగా జగజ్జీవన్ జయంతివేడుకలు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు– కునాకరపేట వద్ద విగ్రహానికి పేట యూత్ సంఘ సభ్యులు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. లాయర్ చెప్పుల వాసు మాట్లాడుతూ దళితులకు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కు కల్పించి, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన జగజ్జీవన్ ఆశయాలు తెలుసుకోవాలన్నారు. కె. పెంటపాడులో జరిగిన కార్యక్రమంలో పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు. ఉండ్రాజవరపు రాజు, ఖండవెల్లి భాస్కరరావు, రవి, లక్కపో కుమార్, పెదపూడి ఆనందరావు, కలిదిండి రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో...

ఇరగవరం మండలంలోని పలు గ్రామాల్లో బాబూ జగజ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవయోధుడు జగజ్జీవన్‌రామ్

తాడేపల్లిగూడెం: అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు నివాళులర్పించారు. జగజ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉద్యానవర్సిటీ, నన్నయ్య ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాల్లో వక్తలు పేర్కొన్నారు. ఉద్యాన వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు క్యాబినెట్ మంత్రిగా, ఆరు నెలల పాటు ఉపప్రధానిగా సేవలు అందించిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. వర్సిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.


కె. పెంటపాడు యూత్ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు


బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి


తాడేపల్లిగూడెం(టీటీసీ): మాలమహానాడు ఆధ్వర్యంలో జయంతి


తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

రాములోరి పెళ్లి సందడి

భైరాగిమఠంలో కోదండరాముని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

పెంటపాడు: మండలంలోని కె.పెంటపాడు గ్రామంలో భైరాగిమఠంలో గోపాలస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శనివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం బయట, వెలుపల విద్యుత్ కాంతులతో భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం జరిగే కల్యాణ మహోత్సవానికి సంబందించి భారీ పందిళ్లు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి కల్యాణ తంతుకు సంబంధించి ముందస్తు ప్రక్రియలో భాగంగా ఆలయం వద్ద విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, నవగ్రహమండప ఆరాధన, అంకురార్పణ, భేరీపూజ, ద్వజారోహణం, బలిహరణ, అగ్ని ప్రతిష్ఠాపన హోమాలతో స్వామివారి కల్యాణ ప్రక్రియ ప్రారంభమైంది. ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠి, రామశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి ఏలూరుకు చెందిన సప్పాభారతి హరికథాధా కాలక్షేపం నిర్వహించారు.

నేటి కార్యక్రమం:

శ్రీరామనవమి పురస్కరించుకొని చైత్రశుద్ధ నవమి పురస్కరించుకొని ఉదయం 6 గంటలకు స్వామివారికి నిత్యార్చనలు, విశేషపూజలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం 9 గంటలకు కల్యాణ ప్రక్రియకు సంబంధించి ఎదుర్కోలు ఉత్సవం, ఉదయం 11.52 గంటలకు సీతారాముల కల్యాణం, అనంతరం భారీ అన్నసమారాధన, మధ్యాహ్నం 2గంటలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో కోలాటం, సాయంత్రం 4 గంటలకు డి. కేశవరానికి చెందిన బ్యాండ్ పార్టీ, ఈశ్వరి కేరళ సింగారి మేళం, తేతలివారి నాసిక్‌డోలు, లలిత కోటేశ్వరి సన్నాయి మేళం, పసలపూడి వారి పలు సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం గరుడవాహనోత్సవం, స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిమని ఈవో చంద్రశేఖర్ తెలిపారు.


అలరిస్తున్న దేవేరుల భారీ విద్యుత్ కటౌట్


నవమికి జరిగే కల్యాణానికి సంబంధించి ఆలయం లోపల భారీ పందిళ్లు

బెల్టు షాపులను అరికట్టాలి


తణుకు ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మునిస్వామి, గీత కార్మికులు

తణుకు అర్బన్: గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో తణుకు ఎక్సైజ్ ఆఫీసు ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గీత కార్మికులకు కల్లు అమ్మకాలు లేక కల్లును నేలమీద వలక పోసే పరిస్థితి దాపురించిందని, దీనికి కారణం గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పడిన లిక్కర్ బెల్ట్ షాపులు అని అన్నారు. ప్రకృతి సిద్ధంగా వచ్చే కల్లును గీత కార్మికులు తీసుకొని అమ్ముకొని వాళ్ల కుటుంబాలను పోషించుకుంటున్నారని, బెల్ట్ షాపులు వలన పూర్తిగా ఉపాధిని గీత కార్మికులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాసాని శీను, పాల సత్యనారాయణ, కట్ట వెంకటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, కాసగాని పోతురాజు, కాగిత పెద్దిరాజు పాల్గొన్నారు.

అన్న సమారాధన

నరసాపురం: పట్టణంలోని రాయిపేట శ్రీ పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉగాది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జి తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థి దశలోనే స్కౌట్‌లో ప్రవేశం అభినందనీయం


పెదతాడేపల్లి గురుకులంలో స్కౌట్స్ ప్రవేశ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థి దశలోనే స్కౌట్స్‌లో ప్రవేశించడం అభినందనీయమని, తద్వారా సేవాభావం అలవడుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కౌట్ ప్రవేశ పరీక్ష క్యాంపు రెండవ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ శిక్షణ ద్వారా ఢిల్లీలో ప్రధానమంత్రి సమక్షంలో జరిగే పెరేడ్‌లో పాల్గొనే స్థాయికి వెళ్తారన్నారు. గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం మాట్లాడుతూ విద్యార్థి దశలో పిల్లలకు ఏ సమయంలో ఎటువంటి అవకాశాలున్నా వాటిని పూర్తిగా విద్యార్థులకు అందించి, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రిన్సిపల్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రవేశ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపల్ బి.రాజారావు, స్కౌట్స్, గైడ్స్ జిల్లా కార్యదర్శి యు.నాగేశ్వరరావు, స్కౌట్ క్యాంపు లీడర్ బ్రహ్మేశ్వరరావు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ పరిశీలకులు సిరిమువ్వ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఇరగవరం: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభ్రదరావు తెలిపారు. ఇరగవరం మండలం ఎర్రయి చెరువు గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ చేసిన పనికి వెంటనే కూలీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు మూడు నెలలుగా కూలీ డబ్బులు చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో పితాని నాగేశ్వరరావు, సంజీవరావు, జుత్తిగ పద్మ, శేషకుమారి, జుత్తుగ శ్రీనివాస్, వెంకన్న, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు సూర్యా కళాశాలలో మెగా జాబ్‌మేళా

నరసాపురం: పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో సోమవారం జిల్లా స్థాయిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దిక్సూచి, పశ్చిమగోదావరిజిల్లా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.